సాక్షి విజయనగరం

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



పోటెత్తిన అర్జీదారులు - 8లో

ప్రజా సమస్యల పరిష్కార వేదికను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తొలిసారిగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు.



అందమైన చేతిరాత.. భవిష్యత్‌కు బంగారు బాట - 8లో

అందమైన చేతిరాత జీవితాన్ని సుందరంగా మారుస్తుందో లేదో చెప్పలేం కాని విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి దోహదపడుతుందని కచ్చితంగా చెప్పవచ్చు.



యూనిఫాం పేరుతో డబ్బులు వసూలు

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే యూనిఫాం పేరు తో అక్రమ వసూళ్లకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

హెచ్ఐవీపై వాల్ పోస్టర్ల ద్వారా అవగాహన

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై గ్రామీణ ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది? రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవీ పరీక్షలు చేశాక హెచ్ఐవీ రుజువైతే చికిత్స ఎక్కడ లభిస్తుందన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్, సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీభత్సం సృష్టిస్తున్న గజరాజులు

- వీటీ ఆర్‌పేటలో తిష్ఠ



పంటపొలాలను నాశనం చేస్తున్న ఏనుగుల గుంపు

వంగర: మండలంలోని వీటీ ఆర్‌పేటలో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజులుగా పంటపొలాల్లో తిష్ఠ వేసిన ఏడు ఏనుగుల గుంపు పంటలను నాశనం చేస్తున్నాయి. తాజాగా సోమవారం గ్రామానికి చెందిన పట్ట శ్రీధర్, పట్ట సింహాచలం, పూడి అప్పలనాయుడు, వేగిరెడ్డి తవిటినాయుడు, పెద్దింటి సింహాద్రినాయుడు, మరడాన అప్పలనాయుడు, మరడాన పైడిపునాయుడు, కోట్ల ఉమామహేశ్వరరావు, పెద్దింటి సూర్యనారాయణ, పెద్దింటి వెంకటనాయుడు, పట్ట రామ్మోహన్ తదితర రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, చెరకు పంటలను నాశనం చేశాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, పంటనష్టం వాటిల్లిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఎటువంటి హాని కలగకుండా ఎలిఫెంట్ ట్రాకర్స్, పోలీసు సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న గాత్రకచేరి



మల్లాజోస్యుల శ్రీకాంత్ గాత్రకచేరీ

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు భవనంలో మూడురోజులుగా ఫ్రెండ్స్ ఫైన్‌ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత ఉత్సవంలో చివరిరోజు చెన్నైకి చెందిన మల్లాజోస్యుల శ్రీకాంత్, పావనిల గాత్ర కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై శివతేజ, మృదం గంపై శ్యామకృష్ణలు సహకారమందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో మొదటి రోజు ప్రాతా కృష్ణమూర్తి, రెండోరోజు ఢిల్లీకి చెందిన డాక్టర్ మండా వెంకట నాగలక్ష్మిలు గాత్రకచేరీ నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో యామిజాల సన్యాసి రావు మాస్టారు, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ ఈఆర్.సోమయాజులు, ధవళ సర్వేశ్వర రావు, వారణాసి వెంకట నరసింహ మూర్తి, టీవీ శ్రీనివాస్, కూరెళ్ల సరోజిని, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

పార్వతీపురం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పలు ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తోందని స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లో నేషనల్ డివార్మింగ్‌డే, హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహనకు 'మీకోసం' కార్యక్రమాల పోస్టర్లను అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ రాకుండా, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

తమ్ముడు తమ్ముడే..పేకాట.. పేకాటే అన్నట్లు తయారైంది ఆ అన్నదమ్ముల మధ్య వ్యవహారం. అన్న మాజీ మంత్రి..తమ్ముడు తాజా ఎమ్మెల్యే..అన్న పదవిలో ఉండగా తమ్ముడెలా అన్ని వ్యవహారాల్లో వేలు పెట్టి అన్నకు తలనొప్పి తెప్పించాడో? ఇప్పుడు తమ్ముడు పదవిలో ఉండగా అన్న కూడా అదేరీతిన వ్యవహరిస్తుండదంతో అన్నదమ్ముల మధ్య బయటకు కనిపించని యుద్ధం సాగుతోంది.



కోల్డ్‌వార్..!

- అన్నదమ్ముల మధ్య కంటికి కనిపించని యుద్ధం
- బొబ్బిలి ఎమ్మెల్యే సిఫారసులకు, మాజీ మంత్రి సుజయ్ అడ్డం
- సోదరుడు ఎమ్మెల్యే అయినా మాజీ మంత్రి అనుచరులదే హవా

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్‌సీపీని వదిలి రాష్ట్ర మంత్రి పదవి అనుభవించిన మాజీ మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణ రంగారావుకు, బొబ్బిలి తాజా ఎమ్మెల్యే ఆర్‌వీ కుమారకృష్ణ రంగారావు (బేబీనాయన)కు మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఉద్యోగుల బదిలీలు, గనుల శాఖలో అనుమతుల కోసం మంత్రిగా సుజయ్ సిఫారసు చేస్తే తమ్ముడు బేబీ నాయన అడ్డుపుల్ల వేస్తుండడం అప్పట్లో చర్చనీయాంశమయ్యేది. అదే సమయంలో మంత్రి సోదరుడిగా చక్రం తిప్పుతూ బేబీ నాయన చేసిన పైరవీలకు మంత్రి సుజయ్ అనుచరులు అడ్డుపడే వారు. మళ్లీ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో బొబ్బిలి నుంచి బేబీ నాయన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సుజయ్‌తో కోల్డ్‌వార్ మళ్లీ మొదలైంది. అన్నదమ్ముల రాజకీయ క్రీడలో అధికారులు, సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు.

● సుజయ్ అడ్డుచక్రం..

బేబీ నాయన పేరుకు బొబ్బిలి ఎమ్మెల్యే అయినా పెత్తనం మాత్రం అన్న సుజయ్‌కృష్ణదేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐల) బదిలీల్లో రాష్ట్రవ్యాప్తంగా కేటాయించిన స్టేషన్లలో అందరూ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఒక్క బొబ్బిలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కె.నారాయణరావు తప్ప. పార్వతీపురం మన్యం జిల్లా కొటియా నుంచి బొబ్బిలి రూరల్ సీఐగా ఆయనకు బదిలీ అయ్యింది. విధుల్లో వారం రోజుల క్రితమే ఆయన చేరాల్సి ఉంది. కానీ బొబ్బిలి రాజుల మధ్య నడుస్తున్న కోల్డ్‌వార్ ఆయన పోస్టింగ్‌కు చేటు తీసుకొచ్చింది. వాస్తవానికి బొబ్బిలి రూరల్ స్టేషన్‌లో సీఐ పోస్టులో నారాయణరావు చేరడానికి ఎమ్మెల్యే బేబీ నాయన సానుకూలత వ్యక్తంచేస్తూ సిఫారసు లేఖ రాశారు.

అన్నదముల సవాల్‌తో సమస్య..

బొబ్బిలి రూరల్ సీఐ పోస్టు ఖాళీగా ఉండడంతో గ్రామీణ మండలాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. పలు గ్రామాల్లో దొంగతనాలు, హత్యాయత్నాలు, అత్యాచార యత్నాలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఎమ్మెల్యే బేబీనాయన, సోదరుడు సుజయ్ మధ్య సవాళ్లు తమకు సమస్యగా మారాయని పోలీసులు, సామాన్య ప్రజలు లోలోన రగిలిపోతున్నారు.

ఆ లేఖనే నారాయణరావు తమ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించుకోగా ఆయనను బొబ్బిలి రూరల్ సీఐగా నియమిస్తూ బదిలీల జాబితాలో పేరు ఖరారైంది. తీరా ఆయన బాధ్యతలు తీసుకునే సమయానికి సుజయ్ అడ్డుచక్రం వేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

'కులం' సాకుతో..

బొబ్బిలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తో లేదా అనుకూల వర్గం వ్యక్తో సీఐగా వస్తే బాగుంటుందని స్థానిక టీడీపీ నాయకులు సుజయ్ చెవిలో ఊదినట్లు సమాచారం. నారాయణరావు కాళింగ సామాజికవర్గానికి వ్యక్తి కాబట్టి తాము ఆశించిన పనులు చేయక పోవచ్చని వాదించారట. ఆయన పోస్టింగ్ కోసం ఎమ్మెల్యే బేబీనాయన స్వయంగా లేఖ ఇచ్చారని చెప్పారట. అంతకుమించి ఆ సిఫారసు లేఖను మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఇప్పించారనీ చెప్పేశారట. అప్పటికే తెంటు అంటే వైరం, సోదరుడు బేబీ నాయనతో కోల్డ్‌వార్ నేపథ్యంలో సుజయ్ వెంటనే స్పందించి నారాయణరావు చేరికకు అడ్డుపుల్ల వేశారని తెలిసింది. పోలీసు అధికారులను సుజయ్ అనుచరులు స్వయంగా కలిసి ఆయన మాటగా అసలు విషయం చెప్పారట. బొబ్బిలి నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న కొప్పుల వెలమ లేదా కాపు సామాజికవర్గానికి చెందిన సీఐని రూరల్ స్టేషన్‌కు ఇవ్వాలని, నారాయణరావు కాళింగ సామాజిక వర్గానికి చెందినవారని, తమకు పనిచేయాలంటే స్థానికంగా కొంత అవగాహన ఉండాలని చెప్పారట. తమకు అనుకూలమైన సీఐని తెచ్చుకునేవరకూ నారాయణరావు బాధ్యతలు తీసుకోకుండా ఆపాలని కరాఖండిగా చెప్పినట్లు తెలిసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారులు వెంటనే నారాయణరావును విధుల్లో చేరవద్దని చెప్పేశారట. ఇప్పుడు ఆయన పరిస్థితి డోలాయమానంలో ఉంది.

20న జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 18 నించి 35 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ మహిళలకు నార్మల్ డిగ్రీ/పీజీ-డిగ్రీ (కెమిస్ట్రీ, ఆక్వా కల్చర్, మైక్రో బయాలజీ) చదువుకుని వయస్సు 19 నించి 25 సంవత్సరాలు మధ్య ఉన్నటువంటి నిరుద్యోగ యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంటర్వ్యూస్ నిర్వహించనుందని, ఈ డ్రైవ్‌కు కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోనున్నారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు వారి వివరాలను హెచ్‌టీటీపీఎస్//స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెస్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒరిజినల్, జిరాక్స్ సెట్లు, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశంలో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947, 9494777553 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



ఆర్‌టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

- ఎస్పీ వకుల్ జిందాల్
- రహదారి భద్రత ప్రమాణాలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించేందుకు ఎస్పీ వకుల్ జిందాల్ విజయనగరంలోని బ్లాక్ స్పాట్‌లు, ముఖ్య కూడళ్ల వద్ద గల ట్రాఫిక్ పాయింట్లను సోమవారం సందర్శించారు. ఈ మేరకు పట్టణంలోని కామాక్షినగర్, అయ్యన్నపేట, పెద్దాస్పత్రి, చర్చి, ఆర్‌అండ్‌బీ, మాగ్నాడైన్ జంక్షన్లు, ప్రదీప్‌నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోట, కొత్తపేట, అయ్యప్పస్వామి టెంపుల్ జంక్షన్, స్వామి లేఅవుట్, రింగురోడ్డులోని రైతు బజార్, ఐస్‌ఫ్యాక్టరీ, బాలాజీ జంక్షన్‌లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగేందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా జంక్షన్‌ల వద్ద వాహనాల రాకపోకలను ఎస్పీ స్వయంగా పరిశీలించి, ప్రమాదాలను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. ప్రమాదాల నియంత్రణకు ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా కాషనరీ బోర్డులను, స్కూల్స్, హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్‌లు, స్టాపర్‌లను ఏర్పాటుచేయాలని చెప్పారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వెలుగు ఉండే విధంగా లైటింగ్ ఏర్పాటుచేయాలని, అవసరమైన ప్రాంతాల్లో ఇంజినీరింగ్ మార్పులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ రెగ్యులేషన్‌కు తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పుట్‌పాత్ వ్యాపారాలు నియంత్రించాలని, వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలని, రేడియం స్టిక్కర్లను ఏర్పాటుచేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణాన్ని ఎస్పీ సందర్శించి, ఆర్టీసీ బస్సుల రాకపోకల మార్గాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని, విధిగా హెల్మెట్ ధరించి, రహదారి భద్రత నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీ సీఐ కేకేవీ.విజయనాథ్, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్సైలు మురళి, లోవరాజు, రవి, రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 15 నుంచి రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



విజయనగరం అర్బన్: భూ సంబంధిత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 15 నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర సిబ్బందితో కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను నిర్వహించాల్సిన తీరును, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ వివరించారు. ఆగస్టు 15న విజయనగరంలో మంత్రి చేతులమీదుగా రెవెన్యూ సదస్సులు లాంఛనంగా ప్రారంభమవుతాయని మొత్తం 45 రోజులపాటు వాటిని నిర్వహిస్తామని తెలిపారు. 16 నుంచి జిల్లా అంతటా పూర్తిస్థాయిలో అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలోని రెవెన్యూ సదస్సుకు తాను హాజరవుతానని వెల్లడించారు. ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. సదస్సుల్లో ఎంఎల్ఏలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారని, రెవెన్యూ అధికారులతోపాటు సర్వేయర్, దేవాదాయ, అటవీ వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖల ప్రతినిధులు కూడా హాజరు కాలవాలని ఆదేశించారు. వచ్చిన ప్రతి అర్జీకి ఒక రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. సదస్సులు పరిశీలించడానికి ఆగస్టు 16న స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ఈ నెల 16న రానున్నారని ఆయన రోజంతా ఇక్కడే ఉండి మండలాల్లో పర్యటిస్తారని తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా అక్టోబర్ 2 నాటికి జిల్లాలోని అన్ని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) శత శాతం పనిచేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, సీపీఓ పి.బాలాజీ, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజు పాల్గొన్నారు.

నారు మడికి ట్యాంకర్ తడి..!




కొత్తపేటలో నారు మడిని కాపాడుకునేందుకు ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న దృశ్యం

- అష్టకష్టాలు పడుతున్న అన్నదాతలు

నెల్లిమర్ల రూరల్:

వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు వేసుకున్న నారు మడులు ఎండిపోతున్నాయి. వరుణుడు కరుణించకపోవడంతో ఆకు మడులను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. నెల్లిమర్ల మండలంలోని కొత్తపేట పరిసర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల పంట పొలాలకు వర్షం నీరే ఆధారం. కొత్తపేట పంటపొలాల్లో ఓ రైతు నారు మడిని కాపాడుకునేందుకు పడుతున్న కష్టం పై చిత్రంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆశించిన స్థాయిలో వర్షం కురవకపోవడంతో కొంతమంది రైతులు సమీప బోర్ల నుంచి మడులకు తడి అందిస్తుంటే..ఇంకొంత మంది రైతులు ట్యాంకర్ల ద్వారా తడులు అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదని, ఈ సమయానికి దమ్ములు పూర్తి చేసేవాళ్లమని రైతులు చెబుతున్నారు. కాగా గొర్లిపేట, ఏటీ అగ్రహారం, సీతారామునిపేట, జగ్గరాజుపేట, తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి.. అవమానం



తాటిపూడి జలాశయం

- కూటమి సర్కారు నిర్వాకం
- గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం పేరు మార్పు
- సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలు

గంట్యాడ: స్వాతంత్య్ర సమరయోధుడు, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన గొర్రిపాటి బుచ్చి అప్పారావును కూటమి సర్కార్ అవమానించింది. ఆయన సేవలను గుర్తించకపోగా ఆయన గౌరవాన్ని తగ్గించేవిధంగా ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వాతంత్య్ర సమరయోధుడని కూడా ఆలోచించకుండా కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రజాస్వామ్యవాదులు మండిపడుతున్నారు. గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయాన్ని తాటిపూడి జలాశయంగా పేరు మార్చుతూ జీఓ ఎంఎస్ నంబర్ 35ను ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ జారీ చేశారు. గొర్రిపాటి బుచ్చి అప్పారావు సేవలను గుర్తించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాటిపూడి జలశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయంగా పేరు పెట్టింది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్న అక్కసుతో కూటమి సర్కారు తాటిపూడి జలాశయానికి బుచ్చి అప్పారావు పేరును తొలగించింది. వేలాది మంది రైతుల సాగునీటి అవసరాలు తీర్చడం కోసం గొర్రిపాటి బుచ్చి అప్పారావు పోరాటం చేసి తాటిపూడి వద్ద జలాశయాన్ని సాధించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సొంత భూమి 10 ఎకరాలు రాసి ఇచ్చిన రైతు బాంధవుడు గొర్రిపాటి బుచ్చిరావు. 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆనాటి మంత్రులు తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరు పెట్టాలని విన్నవించినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

విన్నవించిన వెంటనే స్పందించిన జగన్‌మోహన్ రెడ్డి

రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు పెట్టాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని ఆయన గత సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయంగా పేరుపెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు మార్పు సరికాదు



రైతుల సాగునీటి అవసరాలు తీర్చడం కోసం జలాశయాన్ని సాధించిన స్వాతంత్య్ర సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం పేరును తాటిపూడి జలాశయంగా పేరు మార్చడం సరికాదు. నాడు తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరుపెట్టిన మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో ఎన్‌డీఏ ప్రభుత్వం పేరు మార్చడం సమంజం కాదు.

– వర్రి నరసింహామూర్తి, జెడ్పీటీసీ, గంట్యాడ

పేరు తీసేయడం అవమానించడమే



తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు తీసేయడం సరికాదు. ఆయన ఉత్తరాంధ్ర స్వాతంత్య్ర సమరయోధుల్లో కీలకమైన వ్యక్తి కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కృషి చేసి మహనీయుడు. ప్రభుత్వంపై తీవ్రంగా ఒత్తిడి చేసి జిల్లాలోని వ్యవసాయ భూమి సాగుకు, విశాఖపట్నం నగర దాహార్తిని తీర్చడానికి ఆయన తీసుకొచ్చిన రిజర్వాయర్ తాడిపూడి. అలాంటి వ్యక్తి పేరును రద్దు చేసి జీవో తీసుకురావడం దారుణం. ఈ చర్య స్వాతంత్య్ర సమరయోధులను అవమానించడమే. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– కొరుపోలు సత్యారావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, కొప్పుల వెలమ సంక్షేమ సంఘం

క్లుప్తంగా

అన్న క్యాంటీన్ స్థలంపై వివాదం



హెచ్‌డీటీ భానుప్రసాద్‌కు ఫిర్యాదుచేస్తున్న జమిందార్ కుటుంబ సభ్యుడు పీబీ శ్రీనివాస్

సాలూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలం గుర్తించి, ఈ నెల 14న భూమిపూజ చేపట్టేందుకు అధికార పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. అయితే ఈ స్థలంపై హైకోర్టులో స్టేటస్‌కో ఉందని సాలూరు జమిందార్ కుటుంబానికి చెందిన పీబీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీ భానుప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 162/2లో ఉన్న ఈ స్థలంలో అప్పటి విలేకరుల సంఘ నాయకులు 2009లో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సిద్ధమయ్యారు. అయితే ఆ స్థలం తమదేనని జమిందార్ కుటుంబానికి చెందిన విక్రమ చంద్రసన్యాసిరాజు కోర్టులో కేసు వేశారు. దీనిపై విలేకరుల సంఘ నాయకుడు ఆర్‌వీ నారాయణమూర్తి కౌంటర్ దాఖలు చేయగా.. హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ స్టేటస్‌కో ఇప్పటికీ కొనసాగుతోందని పీబీ శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదాస్పద స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మించవద్దని ఆయన కోరారు. కాగా ఈ స్థలం సీతారామస్వామి వారి ఆలయం ట్రస్ట్‌కు చెందినదిగా ఇటీవల దేవదాయశాఖ అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే దీనిపై దేవదాయశాఖ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ట్రస్ట్ సభ్యుల్లో ఒకరైన జమిందార్ కుటుంబీకుడు పీబీ శ్రీనివాస్ ఫిర్యాదుతో ఈ స్థల వివాదం వెలుగులోకి వచ్చింది. దీనిపై మున్సిపల్ ఏఈ సూరప్పల నాయుడును వివరణ కోరగా.. రెవెన్యూ అధికారులు తమకు స్థలాన్ని చూపించడంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని, స్థల వివాదం గురించి తమకు తెలియదన్నారు. కోర్టులో స్టేటస్ కో ఉన్నందున కూటమి నాయకులు వేరే ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి తమ సచ్ఛీలతను నిరూపించుకుంటారా, లేక అక్కడే ఏర్పాటు చేస్తారా అన్నది వేచి చూడాలి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



జంబో రామారావు (ఫైల్)

భామిని: భార్య పుట్టింటికి వెళ్లిందని తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కీసరలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన జంబో రామారావు (46) భార్య లక్ష్మితో నివాసముంటున్నాడు. మూడు రోజుల కిందట లక్ష్మి కొత్తూరు మండలం కదుము గ్రామంలోని కన్నవారింటికి వెళ్లింది. సోమవారం తిరిగి రావాల్సి ఉన్నా, ఆమె రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రామారావు మద్యం మత్తులో పురుగు మందు తాగాడు. వెంటనే స్థానికులు స్పందించి రామారావును పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గణపతికి సపర్యలు చేస్తున్న స్థానికులు

పూసపాటిరేగ: స్థానిక జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం నరిసింగపల్లికి చెందిన గొలజాన గణపతి రహదారి దాటుతుండగా.. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి విజయనగరం లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు
పోటెత్తిన అర్జీదారులు



అర్జీదారుల వినతులను ముందుగా పరిశీలిస్తున్న మంత్రి అనుయాయులు, బంధువులు



మంత్రి శ్రీనివాస్ వెనుకే ఉన్న టీడీపీ నాయకులు

- మంత్రి అనుయాయులే వినతుల స్వీకరణ
- కంగుతిన్న అర్జీదారులు
- రెవెన్యూ సమస్యలే అధికం

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తొలిసారిగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. మంత్రి స్వయంగా వినతులు స్వీకరిస్తారని ప్రచారం చేయడంతో అర్జీదారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు వినతులు స్వీకరించిన కార్యక్రమంలా కాకుండా మంత్రి అనుయాయులు, బంధువుల సమక్షంలో జరగడం విశేషం. అర్జీదారులు తీసుకువచ్చిన వినతులను కలెక్టర్, మంత్రికి ఇవ్వడానికి ముందే సంబంధిత మంత్రి అనుయాయులు, బంధువులు తీసుకుని సిఫార్సులు చేయడం కనిపించింది. ముందుగా అర్జీలను వాళ్లు పరిశీలించి కలెక్టర్, మంత్రికి ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నెలకొన్న సమస్యలైతే అర్జీదారులను వీరు వేదిక వరకు కూడా వెళ్లనీయడం లేదు. దీంతో పలువురు అర్జీదారులు నిరాశ చెందారు.

రెవెన్యూ శాఖకు సంబంధించినవే..

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ వ్యక్తిత, సామాజిక సమస్యలపై 287 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 182 వరకు అర్జీలు అందాయి. తర్వాత స్థానంలో పింఛన్ మంజూరు చేయాలని 31 మంది అర్జీలు అందజేశారు. పంచాయతీరాజ్ శాఖకు 20, మున్సిపల్ శాఖకు 20, విద్యాశాఖ, ట్రాన్స్‌కోకు సంబంధించి 9 వంతున, గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు సంబంధించి ఆరు, ఆస్పత్రుల సమన్వయ అధికారికి 5, వైద్యారోగ్యశాఖకు 3, హౌసింగ్ శాఖకు 2 వంతున వినతులు అందాయి. వినతల స్వీకరణలో మంత్రితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత మండల తాహసీల్దార్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

దివ్యాంగుని సమస్యకు తక్షణ పరిష్కారం

పరిష్కార వేదికకు వచ్చిన ఓ దివ్యాంగుడి సమస్యకు మంత్రి తక్షణ పరిష్కారం అందించారు. వినతిపత్రం అందించగానే వెంటనే ఆయనకు వినికిడి పరికరాన్ని అందించాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ.డి జగదీష్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదేశించారు. దీంతో వెంటనే అధికారులు వినికిడి పరికరాన్ని తీసుకురాగా, మంత్రి బాధితుడికి అందజేశారు.

అధికారుల సహకారం ముఖ్యం: మంత్రి కొండపల్లి ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విజయనగరాన్ని వికసిత్ జిల్లాగా రూపొందించడంలో అధికారుల సహకారం ముఖ్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా అధికారులంతా సమర్థవంతంగా విధులు నిర్వహించి, ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనులు చేయాలని కోరారు. ప్రభుత్వ అధికారులందరి పనితీరుపైనా పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి..



కలెక్టర్ కార్యాలయంలో వినతులు పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

- గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: భూ సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వస్తున్న తరుణంలో ఆగస్టు 15 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్. శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, ఐటీడీఏ పీఓ సేథు మాధవన్, తదితర అధికారులతో కలిసి వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించి 220 అర్జీలను స్వీకరించారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

భూ సమస్యలపైనే అధిక ఫిర్యాదులు..

భూ సమస్యలు, కుటుంబ సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని మంత్రి సంధ్యారాణి అన్నారు. కుటుంబ సమస్యలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. గిరిజన యువతకు ట్రైకార్ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గిరిశిఖర గ్రామాల గర్భిణులకు డోలీ ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక వసతిగృహాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పీఓ బదిలీ నిలిపివేయాలి

సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బదిలీని నిలిపివేయాలని ఆదివాసీ నాయకులు బిడ్డిక రామ్మోహన్, ఎస్. మోహన్‌పాల్, ఎం. విశ్వనాథం, ఎస్. చిరంజీవి, రామస్వామి, తదితరులు కోరుతూ మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

సమస్యలను పరిష్కరించండి..



అర్జీదారుడి సమస్య వింటున్న ఎస్పీ వకుల్ జిందల్

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: అర్జీదారులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ 42 అర్జీలు స్వీకరించారు.అనంతర ఆయన పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ. నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై గణేష్, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్ : వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

ఎనిమిది వినతులు..

పార్వతీపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది వినతులు అందాయని ఎస్పీ మాధవ్‌రెడ్డి అన్నారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సమస్యలను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ, సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సంతకవిటి: వృద్ధురాలి హత్య కేసుకు సంబంధించిన నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కేఆర్ పురం గ్రామానికి చెందిన కాయల ఎల్లమ్మ (60)పై అదే గ్రామానికి చెందిన తేగల రాము మద్యం మత్తులో ఈ నెల మూడో తేదీన దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఎల్లమ్మను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉండగా... సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర, ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

వృద్ధురాలి హత్య..?

- బంగారు ఆభరణాల కోసమేనా..!



కృష్ణవేణమ్మ (ఫైల్)

బాడంగి: మండల కేంద్రంలోని ముగడ కాలనీలో నివాసముంటున్న వృద్ధురాలు గెద్ద కృష్ణవేణమ్మ (62) ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందింది. అయితే ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు మాయం కావడం, ఇళ్లంతా చిందరవందరగా ఉండడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు హత్యగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... కృష్ణవేణమ్మ ముగడ కాలనీలో ఒంటరిగా నివాసముంటోంది. ఈమె భర్త అప్పలనారాయణ (రిటైర్డ్ టీచర్) గతంలోనే మృతి చెందగా... ఇద్దరు కుమారులు వేరే ప్రాంతాల్లో నివాసముంటున్నారు. దీంతో ఆమె ఒంటిరిగా ఉంటోంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి గ్యాస్ వాసన రావడంతో పక్కనే ఉన్న మహిళలు కిటికీలోంచి చూడగా.. కృష్ణవేణమ్మ నేలపై పడిపోయి ఉంది. వెంటనే ఈ విషయాన్ని పాలకొండలో ఉంటున్న ఆమె రెండో కుమారుడు నాగేంద్రకుమార్‌కు తెలియజేయగా.. తాళాలు పగులగొట్టి తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. స్థానికులు తాళాలు పగులగొట్టి చూడగా.. ఆమె మృతి చెంది ఉంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్సై జయంతి, బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, రామభద్రాపురం, తెర్లాం ఎస్సైలు జ్ఞానప్రసాద్, రమేష్, విజయనగరం నుంచి నేరపరిశోధన టీమ్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

హత్యగా అనుమానం..

ఇంటి పరిసరాలను గమనిస్తే ఇళ్లంతా చిందరవందరగా ఉండడం, మృతురాలి ఒంటిపై బంగారు నగలు లేకపోవడంతో ఎవరో ఆదివారం రాత్రి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంగారం తీసే క్రమంలో ఆమె ప్రతిఘటించడంతో పీక పిసికి చంపి ఉంటారని భావిస్తున్నారు. మృతురాలి మెడభాగం కమిలిపోగా.. ముక్కు నుంచి రక్తం కారిన ఆనవాలున్నాయి. ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించారు.



కృష్ణవేణమ్మ మృతదేహం

కేసు నమోదు..

మృతురాలి పెద్ద కుమారుడు హరికృష్ణ విశాఖలో, చిన్న కుమారుడు నాగేంద్రకుమార్ పాలకొండలో ఉంటున్నారు. చిన్నకుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రశ్నించేతత్వమే పరిశోధనలకు పునాది..



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, తదితరులు

- సెంచూరియన్ వీసీ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: ప్రాజెక్టల తయారీపై విద్యార్థులు పట్టు సాధించాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి అన్నారు. మండలంలోని టిక్కలి సెంచూరియన్‌లో ఈసీఈ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించేతత్వమే పరిశోధనలకు పునాది అని, ఎందుకు, ఏమిటి, ఎలా అనే ప్రశ్నల నుంచే నూతన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయన్నారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టలు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి జోగినాయుడు, డీన్లు మాధవరావు, సన్నీడియోల్, తదితరులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాత..
భవిష్యత్‌కు బంగారు బాట

- నేడు ప్రపంచ కాలిగ్రఫీ (చేతిరాత) దినోత్సవం
- కాలిగ్రఫీలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న నందిని
- తోటి విద్యార్థులకు నేర్పుతూ ఆదర్శంగా నిలుస్తున్న చిన్నారి



నాటి విజయవాడ కలెక్టర్ ఢిల్లీరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని కొల్లి నందిని (ఫైల్)



విద్యార్థులకు అందమైన చేతిరాత గురించి శిక్షణ ఇస్తున్న కొల్లి నందిని

సాలూరు: అందమైన చేతిరాత జీవితాన్ని సుందరంగా మారుస్తుందో లేదో చెప్పలేం కాని విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి దోహద పడుతుందని కచ్చితంగా చెప్పవచ్చు. ఆగస్టు రెండో బుధవారం (నేడు) ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం సందర్భంగా కాలిగ్రఫీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న సాలూరుకు చెందిన కొల్లి నందినిపై ప్రత్యేక కథనం. పట్టణంలోని గాడివీధి మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కొల్లి నందిని రెండేళ్ల కిందట అందమైన చేతిరాత కోసం (7వ తరగతిలో) కృషి చేసింది. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందిన అనంతరం రాష్ట్ర స్థాయిలో ఇంగ్లిష్‌లో జరిగిన కాలిగ్రఫీ పరీక్షల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రథమస్థానం సంపాదించింది. విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నాటి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మన్ననలతో పాటు ప్రశంసాపత్రాన్ని పొందింది. తన చేతిరాతకు మరింత పదును పెట్టి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ, పలు అవార్డులు సొంతం చేసుకుంది.

తోటి విద్యార్థులకు నేర్పుతూ..

అందమైన చేతిరాత తన తోటి విద్యార్థులకు కూడా సొంతం కావాలనే ఉద్దేశంతో తన ప్యాకెట్ మనీ నుంచి పుస్తకాలు కొనుగోలు చేసి గతేడాది వేసవిలో పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో నిరుపేద పిల్లలకు అందించింది. వారికి చేతిరాతకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించింది. అలాగే తాను ప్రస్తుతం చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలో 7, 8 తరగతుల విద్యార్థులకు సైతం శిక్షణ ఇస్తోంది. ఖాళీ సమయాల్లో నందిని తరగతులు నిర్వహిస్తూ తోటి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడంతో చిన్నారిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

యూనిఫాం పేరుతో డబ్బులు వసూలు

- ఉపాధ్యాయుడి తీరుపై తల్లిదండ్రుల ఫిర్యాదు



ఉపాధ్యాయుడి తీరుపై ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లులు



బ్రాంచ్ పాఠశాల

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే యూనిఫాం పేరు తో అక్రమ వసూళ్లకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జి.నరసింహదేవ్ 12 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అలాగే ఎన్‌సీసీ టీచర్‌గా కూడా అతనే వ్యవహరిస్తున్నారు. 100 మంది ఎన్‌సీసీ వలంటీర్ల బ్యాంక్ ఖాతాలకు యూనిఫాం పేరిట వచ్చిన డబ్బును తిరిగి ఆయన తీసుకున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3500 నుంచి నాలుగు వేల రూపాయల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై పలువురు తల్లితండ్రులు మాట్లాడుతూ, మీ పిల్లల బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడ్డాయి. నాకు తెచ్చి ఇవ్వండి అని ఆ టీచర్ అడగడంతో తాము ఇచ్చామని చెప్పారు. స్కూల్ నుంచి రిలీవ్ అయిన పదో తరగతి విద్యార్థుల నుంచి యూనిఫాం కూడా తిరిగి తీసుకున్నారని తెలిపారు. వాస్తవానికి ఎన్‌సీసీలో జాయిన్ అయిన తర్వాత 13వ బెటాలియన్ వారు 2021 సంవత్సరం వరకు క్లాత్, రూ.600 కుట్టుకూలి ఇచ్చేవారు. 2022లో రూ.3800 చొప్పున విద్యార్థుల బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. 2023 సంవత్సరానికి సంబంధించి 2024 మార్చి నెలలో రూ.4370 వేశారు. ఇందులో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 3500 నుంచి నాలుగు వేల రూపాయలు నరసింహదేవ్ వసూలు చేశారని తల్లిదండ్రులు చెబుతున్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీలో జాయిన్ అవ్వగానే ఎవరికి వారు యూనిఫాం కుట్టించుకున్నారు. వారికి 9వ తరగతిలో డబ్బులు వేశారు. అలాగే 9వ తరగతిలో జాయిన్ అయిన వారికి 10వ తరగతిలో వేశారు. స్కూల్ నుంచి 10వ తరగతి విద్యార్థులు రిలీవ్ కాగానే యూనిఫాం తీసుకుని, అవే దుస్తులను కొత్తగా జాయిన్ అయిన విద్యార్థులకు ఇస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఆ దుస్తులను మరలా సరి చేసుకుని వేసుకున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన దుస్తులు, డబ్బులు తీసుకోవడం ఎంతవరకు న్యాయమని, వెంటనే విద్యాశాఖ, ఎన్‌సీసీ అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ఎన్‌సీసీ వలంటీర్లకు ఇవ్వాల్సిన టిఫిన్ విషయంలో కూడా ఉపాధ్యాయుడు చేతివాటం ప్రదర్శిస్తున్నాడన్న విమర్శలున్నాయి.

విచారించా..

నేను హెచ్‌ఎంగా వచ్చి ఏడాది అయింది. డబ్బుల వసూలు విషయమై కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రులు నాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్‌సీసీ టీచర్ నరసింహదేవ్‌ను పిలిచి వివరణ కోరగా.. విద్యార్థులకు యూనిఫాం, టై, షూ ఇస్తున్నానని, అందుకే డబ్బులు వసూలు చేసినట్లు చెప్పారు.

– వి. వరప్రసాదరావు, హెచ్‌ఎం బ్రాంచ్ స్కూల్

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹98	₹166	₹176